# రైలు పెట్టెలో భీమా పాలసీ

(పూర్వకథ: ఇన్స్యురెన్స్ ఏజెంట్లు మీటింగు నుంచి తిరిగి వస్తున్నాడు ఈశ్వరరావు. అంతకుపూర్వం ఒక్క పాలసీ కూడా కట్టించలేని ఈశ్వరరావు, జనరల్ మేనేజర్ తన కిచ్చిన సలహాలనాచరణలో పెట్టి, వెంటనే ఏదో ఓ పాలసీదారుణ్ణి సంపాదించాలన్న నిశ్చయంతో తన ఊరు ప్రయాణానికి రైలు ఎక్కాడు.

అతని అదృష్టం బాగానే ఉంది. ఇన్సూరు చెయ్యడానికి అవసరమైన లక్షణాలన్నీ ఉన్న కుర్ర బడిపంతులు అతని కళ్ళపడ్డాడు. మౌనంగా కూర్చున్న అతని దగ్గరకు వెళ్ళి తాను నూతనంగా నేర్చుకున్న మనస్తత్వ విధానాన్ని ఆ కుర్రవాడి మీద ప్రయోగించాడు. ఆ పంతులు ప్రాణం అశాశ్వతం. అతని భార్య జీవితం బుద్బుద ప్రాయం - అంచేత ఏ క్షణాన ఏమొస్తుందో? - ఈ ధోరణిలో రావు ప్రారంభించేసరికి , పంతులు బావురుమన్నాడు. ఏమిటని ఓ ముసలమ్మ అప్యాయంగా అడిగితే 'నా భార్య చనిపోతుంద'ని రాగాలెట్టడం ప్రారంభించాడు ఆ పంతులు.

ఈశ్వరరావుకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది- పంతులు ఏడుపు మాత్రం మానే ధోరణిలో లేడు ఇహ-)

ఆ పెట్టెలో కూర్చున్న వాళ్లందరికీ ఆ కుర్రవాడు ఎందుకు అంతగా ఏడుస్తున్నాడో సరిగ్గా తెలియదు. మొదట బెంచీలో వాళ్లు ఆయన భార్యకు ప్రాణం మీదికి వచ్చింది అని అనుకున్నారు. మూడో బెంచీలో వాళ్లు ఆమె పోవటానికి కారణాలు కూడా పోగుచేస్తున్నారు!

కొంతమందికి ఈశ్వరరావుపైన కోపంకూడా వచ్చింది. అతనివైపు కొరకొరా చూశారు. ఈ వెధవ కబురు ఇప్పుడే చెప్పకపోతేనేం! రైలు దిగిన తరువాత చెప్పకపోయినాడా అని వాళ్ళంటారు.

ఈశ్వరరావు కూడా ఆ అబ్బాయి ఎందుకు ఏడుస్తున్నాడని కొంచెం ఆలోచించాడు. అతనికి ఒక విధంగా తోచింది. అతని భార్యకు బహుశా చాలా జబ్బుగా ఉండి ఉంటుంది. ఇంతకు పూర్వమే ఆయన ఈ విషయమై ఆలోచిస్తూ

దిగులుపడి కూర్చుని ఉంటాడు. మొదట్లో తన మాట వినకుండా పరధ్యాన్నంగా, దిగులుగా, ఉంటడానికి కూడా అదే కారణం అయి ఉండాలె!

నీ భార్యా, బిడ్డలు అన్నంలేక మాడి చచ్చిపోతారు అన్నాడే, ఆ మాటలు, ఎందుకు అన్నాననీ, ఏ సందర్భంలో అన్నాననీ, అతన్ని మాత్రం చాలా కష్టపెట్టి ఉంటవి. చాలా బాధ కలిగి ఉంటుంది. అతనికి ఇదివరకే ఉన్న విచారానికి ఇది తోడుకాగా, అతడు దుఃఖాన్ని ఆపుకోలేక పోయి ఉంటాడు. ఏజెంటు మహాశయుడు తనకున్న సైకో అనాలిసిస్ శాస్త్రజ్ఞానం అంతా వినియోగించి, ఈ నిశ్చయానికి వచ్చాడు.

ఇంతలో పంతులు కాస్త దారికొచ్చాడు. ఏడ్వటంమాని దిగులుగా కూర్చున్నాడు. దుఃఖం కాస్త తగ్గింది కదా అని ముసలమ్మగారు ఇట్లా అన్నది. "అట్లా, ధైర్యంగా ఉండు, నాయనా! ఏడిస్తే ఏమి లాభం?" ఆ కుర్రాడు పిచ్చి చూపులు చూస్తూ ఊరుకున్నాడు.

"వాళ్ళిద్దరూ బావమరుదులేటమ్మా!" అని చివరబెంచీలో ఎవరో అన్నారు. వాళ్లకు ఈ సంగతి ఎట్లా తెలిసిందో!! ఎట్లాగు ఊహించారో మరి!

ముసలమ్మగారు ఇది నిజమో కాదో తెలుసుకొందామని అడిగింది. 'ఏం నాయనా, అయితే ఆయన అక్కను నీ కిచ్చారా, నీ అక్కను ఆయనకిచ్చారా?

ఈ మాటలు వినేసరికి ఈశ్వరరావుకు పై ప్రాణాలుపైన పోయినాయి, ఆ అబ్బాయికీ తనుకు కూడా బంధుత్వం కలుపుతున్నారు వీళ్ళంతా కలిసి!! దీనికి సమాధానం ఆయనే చెబుతాడో, తననే చెప్పమంటారో, అని భయపడి చస్తున్నాడు.

ఆ అబ్బాయి తలే ఊపాడో, చెయ్యే ఊపాడో, ఏమిచేశాడో, తెలియదు కాని, మొత్తం మీద అందరికీ ఇట్టే అర్థమైంది. వాళ్ళిద్దరూ బావమరుదులే నట!

ఇన్స్యూరెన్సు వ్యాపారం చేయటంలో ఇల్లాగ అనివార్యంగా క్రొత్త క్రొత్త బాంధవ్యలు ఏర్పడుతాయని పాపం ఈశ్వరరావుకు తెలియదు. అందుచేతనే అతడు చాలా గాభరాపడుతూ, కూర్చున్నాడు.

క్రొత్తగా ఏర్పడిన ఈ బాంధవ్యాన్ని సమన్వయపరచుకుంటూ ఈ ఏజెంటూ,

ఆయన కెదురుగా ఆ పంతులూ కూర్చున్నారు. ముసలమ్మగారు మళ్ళీ అడిగింది – 'నాయనా నీకేమన్నా బిడ్డదా?' అని.

పంతులు మాట్లాడకుండా ఒక వేలుఎత్తి చూపాడు. "ఒక బిడ్డా నాయనా, చిన్నతనం లోనే బిడ్డ కలిగిందీ," అంటూ ఆ అబ్బాయి తల నిమిరింది. బిడ్డమాట ఎత్తేసరికి పంతులు, ఇందాకటి కంటే కూడా పెద్దగా, భోరున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారు అన్నది. "ఊరుకోవయ్యా ఆ బిడ్డను చూచుకొని అయినా బ్రతకాలా?" 'ఆ బిడ్డ కూడా బ్రతకదు!' – అని అంటూ పంతులు ఏజెంటుగారి మెడను వాటేసుకొని భుజం మీద తలవాల్చి ఏడవటమే ఏడ్వటం!! ఎవ్వరు, ఏమి చెప్పినా వినక ఘోరంగా ఏడ్వటం సాగించాడు.

పంతులు తనను కౌగిలించుకొని ఏడ్వటం తనకెంతో కష్టంగా ఉన్నా, అక్కడున్న వాళ్లెవ్వరికీ ఏమీ కష్టంగాలేదు. బావమరిది కౌగలించుకొని ఏడ్వటంలో విపరీతం ఎవ్వరికీ కనపడలేదు. కాని తనుకూడా ఏడ్వకపోవటమే అందరికీ బహుశా విచిత్రంగా ఉండి ఉండాలి! ఎందుచేత అంటే ఆ జబ్బుగానున్న మనిషి సాక్షాత్తు తన అక్కేనాయ!

తాను, కఠిన హృదయుడని అప్పుడే అందరూ అనుకొంటున్నారు! కాదంటానికి తనకు ధైర్యం ఎప్పుడూ లేదు! చచ్చినట్లు, ఆ ఏడుస్తూ ఉన్న కుర్రాడు తన అక్క మొగుడని ఒప్పుకుంటానికి ఈశ్వరరావు నిశ్చయించుకొనే ఉన్నాడు కాని, తానుకూడా ఏడవవలసిన పరిస్థితి వస్తుందని అతడు ఎప్పుడూ ఊహించలేదు.

దీనిదుంపతెగ, ఈ ఇన్స్యూరెన్సు ఇంత అవస్థలోకి దింపుతుందని తెలిసినట్లయితే మొదట్లోనే తప్పుకొనేవాడు.

కాని ఇప్పుడేమి చేస్తాడు? ఏడవక తప్పింది కాదు. అక్కకూడా పోయిందాయె! ఏడవకుండా ఎల్లాగ! పంతులును కౌగలించుకొని తప్పనిసరిగా ఏడ్చాడు.

అయితే ఒక్క సంగతి అది బొల్లి బొల్లి ఏడ్పుమటుకు కాదు. ఏజంటుగారికి ఎందుకైనా కానీ, నిజమైన దుఃఖమే వచ్చింది. హృదయపూర్వకంగా ఏడ్చాడు!

ఉన్నవాళ్ళంతా 'ఊరుకోండి నాయనా ఊరుకోండి! ఎందుకు ఏడ్వటం! ఏమి లాభం! అయిపోయిందాయె!' అంటూ బావమరుదులు నిద్దరినీ కూడా ఓదార్చారు!

ములసమ్మగారు ఈ పర్యాయము ఈశ్వరరావును దగ్గరకు తీసుకొని తల నిమురుతూ, అన్నది. 'పిచ్చి పిల్లవాడా! నీవుకూడా ఏడిస్తే ఎల్లాగ? కాస్త ధైర్యం తెచ్చుకో! మీ బావ దిగులుపడి పోయినాడు! ఆయనకు కాస్త ధైర్యం చెప్పాలిసింది పోయి ఏడిస్తే ఎల్లాగ చెప్పు?'

ఏజెంటు మహాశయుడు ముసలమ్మ మాటలు విని, ఏడ్వటం మానేశాడు.

పంతులు కూడా మానాడు. కాని పూర్తిగా మానలేదు. కాసేపు ఊరుకొంటాడు. ఏదో జ్ఞాపకం వస్తుంది. మళ్లీ ఏడుస్తాడు. ఇదీ అతని వరుస!

దుఃఖం వచ్చినవాడు తాను ఒక్కడే, తన ఇష్టం వచ్చినట్లు ఏడవక ఏజెంటు మహాశయుని కౌగలించుకొని ఏడుస్తూ ఉండడం మూలాన, ఆయన ఏడ్చినప్పుడల్లా తానుకూడా ఏడ్వవలసిన అగత్యం కలగటమే ఈశ్వరరావుకు ఇప్పుడు వచ్చిన క్రొత్త సంకటం!

దిగి పారిపోతే ఎల్లా ఉంటుందీ అని ఈశ్వరరావు ఆలోచించకపోలేదు. ఎట్లా దిగిపోవటం! అవతల బావను వదిలి!

అంతగా మూర్ఛించి దిగితే, అంతా నీకేమైనా బుద్ధి ఉందా లేదా? అని చీవాట్లు వేస్తారు. అంతటితో ఊరుకోరు కూడాను. అవతల ఆ అబ్బాయి కుళ్లి కుళ్లి ఏడుస్తూ ఉంటే నీవు ఎట్లాగ వెడతావయ్యా అని లాగి కూలేస్తారు! ఇంకా పెంకెతనం చేస్తే తలొక మొట్టికాయ మొట్టినా దిక్కులేదు. ఈశ్వరరావు ఈ విషయమై చాలా బాగా ఆలోచించే, దిగిపోవటానికి వీలులేదని నిశ్చయించుకొని అక్కడే కూర్చున్నాడు. వీలైనప్పుడల్లా ఒకప్పుడు ఏడుస్తూ. స్టేషనులు వచ్చిపోతున్నాయి. పంతులు ఎక్కడా దిగిపోవాలని ప్రయత్నం చేయటమే లేదు.

బెజవాడ దగ్గరలోకి వస్తున్నది. ఏదో ఒక స్టేషనులో బండి ఆగింది. ఆగీ ఆగటంతోనే ఎవరో ఒకాయన వీళ్ళ పెట్టె దగ్గరకొచ్చి, తొంగిచూచి, 'ఇక్కడున్నాడ్రా!' అని పెద్ద కేక పెట్టాడు. మరుక్షణంలో ఒక ముసలాయన కూడా పరుగెత్తుకుంటూ వచ్చి ఈ పెట్టెలోనే ఎక్కాడు.

ఆ వచ్చినవాళ్లు ఇద్దరూ పంతులుకు చెరో ప్రక్కనా కూర్చున్నారు. ఒకాయన

అన్నాడు. "ఒరి నీ దుంపతెగ! నీ కోసం వెదకలేక చస్తున్నాం, ప్రతి స్టేషనులోనూ దిగి!" ఇంకో ఆయన 'ఇక్కడి కెప్పుడు వచ్చావురా సన్యాసీ!' అన్నాడు.

వాళ్ళను చూచి పంతులు మళ్ళీ ఏడ్పు సాగించాడు.

ముసలమ్మగారు అడిగింది వాళ్ళల్లో ఒకాయనను, 'నాయనా, ఆ అబ్బాయి మీకేమౌతాడు?' 'మా అబ్బాయి' అన్నాడు ఆ ముసలాయన.

'ఆయనా?' అని రెండో వ్యక్తిని చూపి అడిగింది! 'వాడి మేనమామ' అని జవాబు చెప్పాడు ఈ ముసలాయన.

ఈ జవాబులతో ముసలమ్మ తృప్తిపడి ఆ వచ్చినవాళ్ళతో మళ్లీ అన్నది. "ఇందాకటి నుంచీ ఒక్కటే ఏడ్పు బిడ్డ! మేమెంత చెప్పినా వినటం లేదు. ఆ బిడ్డను ఒంటరిగా వదిలేశారేం బాబూ?"

ఆ ముసలాయన పిల్లవాణ్ణి కసురుకుంటూ అడిగాడు – "ఎందుకురా ఏడ్పు!!" పిల్లవాడు పాపం బిక్కమొఖం పెట్టాడు.

*(ఆనందవాణి వారపత్రిక, 14. 4. 1946)*

కథా నిలయం
శ్రీకాకుళం